www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 3 సెప్టెంబర్ 2023

5

ఏలూరు



15, 16 తేదీల్లో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఏలూరు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు (మ్యూజిషియన్) కోసం ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్ మెంట్ ఆఫీసర్(తెలుగు రాష్ట్రాలు) కమాండింగ్ ఆఫీసర్, వింగ్ కమాండర్ గుర్ ప్రీత్ అత్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అవివాహిత అభ్యర్థులు ఈనెల 15వ తేదీ ఉదయం పది గంటల్లోపు 12 ఎయిర్‌మేన్ సెలక్షన్ సెంటర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ బేగంపేట, సికింద్రాబాద్ రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. పదోతరగతి పాసైనవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెబ్ పేజీకి లింక్‌తో అధికారిక వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌ను https://agnipathvayu.cdac.in చూడొచ్చన్నారు. రాత పరీక్ష, పిఎఫ్‌టి, ఎటి–2, వైద్య పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఎఎస్‌సి, బేగంపేట, సికింద్రాబాద్‌లో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.



వికలాంగునితో మాట్లాడుతున్న లోకేష్



లోకేష్‌కు వరి కంకులతో స్వాగతం పలుకుతున్న గన్ని

జగన్ హయాంలో కార్పొరేషన్లు నిర్వీర్యం

బిసిలను విస్మరించిన వైసిపి

యాదవులకు, రజకులకు అండగా ఉంటాం

'ఆదరణ' ద్వారా కులవృత్తులను కాపాడుతాం

యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

202వ రోజు ఉంగుటూరు నియోజకవర్గంలో సాగిన యాత్ర

టిడిపిలోకి పలువురు వైసిపి సీనియర్ నేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిఎం జగన్ యాదవులతో పాటు అన్ని బిసి కులాలను తీవ్ర నిర్లక్ష్యం చేశారని టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పాదయాత్ర 202వ రోజు శనివారం ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలో సాగింది. ముందురోజు తూర్పుగోదావరి జిల్లాలో సాగిన యాత్ర ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. తొలుత నీలాద్రిపురంలో యాదవులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. యాదవులకు ఉచితంగా గొర్రెలు పంపిణీ చేయాలని, మేత, దాణా కోసం కొంత భూమి కేటాయించాలని, రెయిన్ కోట్లు, దోమ తెరలు అందించాలని, 50 ఏళ్ల దాటిన గొర్రెల కాపరులకు ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలని, వర్షాకాలంలో గొర్రెలకు వచ్చే దొమ్మ రోగాలకు ఉచితంగా మందులు పంపిణీ చేయాలని, కూలిపనుల్లేక యాదవ మహిళలు దుర్భర జీవితం గడుపుతున్నారని, వారికి ఆవులు లేదా గేదెలు ఉచితంగా పంపిణీ చేయాలని లోకేష్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో యాదవులతోపాటు అన్ని బిసి కులాలను సిఎం జగన్ తీవ్ర నిర్లక్ష్యంచేశారన్నారు. బిసి సబ్ ప్లాన్ నిధులు రూ.75,790 కోట్లు దారిమళ్లించారని, కులానికొక కుర్చీలేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. టిడిపి హయాంలో యాదవ కార్పొరేషన్ ద్వారా రూ.278 కోట్లు, పశు సంవర్ధకశాఖ ద్వారా జీవాల కొనుగోలుకు రూ.395 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. టిడిపి వచ్చాక 22 గొర్రెలను యూనిట్‌గా తీసుకుని పంపిణీ చేస్తామని, బీమా సౌకర్యం కల్పిస్తామని, సబ్సిడీపై ఆవులు, గొర్రెలు అందిస్తామని ప్రకటించారు. జీవాలను ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేస్తామని, వ్యాధినివారణ మందులు, దోమతెరల పంపిణీకి చర్యలు తీసుకుంటామని, యాదవులు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలందజేస్తామని హామీ ఇచ్చారు.

టిడిపిలోకి వైసిపి సీనియర్ నేతలు

ఉంగుటూరుకు వైసిపి సీనియర్ నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటిస్తున్న లోకేష్‌ను వారంతా కలిసి పార్టీలో చేరారు. టిడిపి కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వేగేశ్న రంగరాజు, సోడింపల్లి రాజంరాజు, పచ్చ కృష్ణ, నూకల వెంకటేష్, పెన్మెత్స శ్రీనివాసరాజు, తమ్మిన నాగేశ్వరావు ఉన్నారు.



బిసి ప్రతినిధుల ముఖాముఖీలో మాట్లాడుతున్న లోకేష్

బిసి ప్రతినిధులతో ముఖాముఖీ

ఉంగుటూరులో బిసి సామాజికతరగతి ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాదవులకు జగన్ ప్రభుత్వం ఎలాంటి సాయమూ చేయడం లేదన్నారు. టిడిపి హయాంలో రజకులకు పనిముట్లు ఇచ్చారని, జగన్ ప్రభుత్వం రజక సామాజికతరగతిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కళింగ కులస్తులకు రాజకీయ అవకాశాలు దక్కడం లేదని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తమను ఆదుకోవాలని కోరారు. జగన్ ప్రభుత్వం మత్స్యకారుల పొట్ట కొట్టిందని, చెరువులు వేలం పెట్టి తమ చెరువులు లాక్కున్నారని, కొల్లేరుపై ఆధారపడిన బిసిలు అన్యాయానికి గురైయ్యారని తమను ఆదుకోవాలని కోరారు.

దీనిపై లోకేష్ మాట్లాడుతూ బిసిలను పేదరికం నుండి బయటకి తీసుకురావడమే తమ విధానమన్నారు. బిసిలకు పుట్టినిల్లు టిడిపి అని, వారికి రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది టిడిపి ఆవిర్భావం తరువాతేనని తెలిపారు. బిసిలకు 24 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది ఎన్‌టిఆర్ అని తెలిపారు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేశామని, చంద్రబాబు బిసి రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. ఆదరణ పథకం ప్రవేశ పెట్టి కుల వృత్తులను కాపాడామన్నారు. తమ హయాంలో బిసిలకు కీలక పదవులిచ్చామని, బిసి సబ్ ప్లాన్, కార్పొరేషన్ ద్వారా ప్రతిఏడాదీ బిసిలకు రూ.మూడు వేల కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. సిఎం జగన్ బిసిలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 16 వేల మందిని పదవులకు దూరం చేశారన్నారు. జగన్ పాలనలో ఒక్క బిసికి రుణం రాలేదని విమర్శించారు. బిసిలపై 26 వేల అక్రమ కేసులు పెట్టిన ఘనత కూడా జగన్ ప్రభుత్వానిదేనన్నారు. అమర్నాథ్ గౌడ్‌ని వైసిపి నాయకులు అత్యంత కిరాతకంగా చంపేశారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రత్యేక బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. టిడిపి హయాంలో రజకులకు ఇస్త్రీ పెట్లు, వాషింగ్‌మెషిన్‌లు అందించామని, ఈసారి ఉచితంగా విద్యుత్ కూడా అందిస్తామని చెప్పారు. దోబీ ఘాట్లపై రజకులకు పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. ప్రతీ ఏడాది ఆదరణ పథకం అమలు చేస్తామని, చేతి వృత్తులను కాపాడతామని హామీ ఇచ్చారు.

పేదల గోడుపట్టని బిజెపి

సిపిఎం సమరభేరిలో నేతలు - జిల్లావ్యాప్తంగా సాగిన నిరసన కార్యక్రమాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయని సిపిఎం నేతలు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సిపిఎం 'సమరభేరి'లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా పార్టీ నేతలు ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

జీలుగుమిల్లి : మండలంలోని వంకవారిగూడెం, జీలుగుమిల్లి సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ పేదలపై భారాలు మోపుతూ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను బిజెపి అమలు చేస్తుందని విమర్శించారు. బిజెపి హయాంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో ఉన్న వైసిపి బిజెపికి తోత్తుగా మారిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, రాజమండ్రి దానియేలు, కారం దుర్గ, ఎస్.అప్పారావు, కొండలరావు, నిర్మల పాల్గొన్నారు..

జంగారెడ్డిగూడెం : నిరుద్యోగం, నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని పట్టినపాలెం సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రవి మాట్లాడారు. బిజెపి గద్దెనెక్కిన నాటి నుండి ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తూ దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెడుతుందని మండి పడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, పి.దుర్గ, ఎం.చిన్నలక్ష్మి, కోసం రాముడు, బోడిగ సీతారాములు పాల్గొన్నారు.

మండలంలోని తాడువాయిలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో ఉదయం ఇంటింటికీ తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర సరుకుల ధరలు పెట్రోల్, డీజిల్ గ్యాస్, విద్యుత్, విధానాలు మానుకోవాలని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పేదలకు ఎర్ర కాలువ ప్రాజెక్ట్ మిగులు భూములు పంచాలని, ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని సచివాలయం వద్ద సిపిఎం నాయకులు పటాన్ మస్తాన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మానుకొండ జీవ రత్నం. మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం పేద ప్రజలు కొనుగోలు చేసే నిత్యవసర సరుకుల ధరలు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ ధర్నాలో ప్రభాకర్‌రావు, కె.సుబ్బారావు, లక్ష్మీనారాయణ, రామారావు, బి.నాగేశ్వరరావు, కెవి.రెడ్డి, లక్ష్మణరావు, మంగరాజు పాల్గొన్నారు.

కలిదిండి : 'సమర భేరి'లో బాగంగా మండలంలోని పోతుమర్రు, సానా రుద్రవరం, కోరుకొల్లు, ఎస్ఆర్‌పి అగ్రహారం, చిన తాడినాడ గ్రామాల్లో సిపిఎం నాయకులు సంతకాల సేకరణ నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజాసమస్యలపై సంతకాలతో కూడిన అర్జీలను అధికారులకు అందించినట్లు సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీకాంత్, రమేష్, వినోద్, గంటా సోమయ్య, వై.మంగయ్య, నున్న వెంకన్న, కె.శ్రీనివాసరావు, పాపారావు, వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన మండల కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గొల్లగూడెం, కనసానపల్లి, అడవినెక్కలం, ఆగిరిపల్లి, వడ్లమాను గ్రామాల్లో సిపిఎం సమరభేరిలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, ఆర్.చంటి, ఎం.నరేష్, నవీన్ కుమార్, గోపాలరావు, సుభాని పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం మండలంలో..

4న మండల, మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ఏలూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, పెరిగిన ధరలు తగ్గించాలని, యువతకు ఉద్యోగాలివ్వాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల నాలుగో తేదీన జిల్లాలోని అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ ఆఫీసుల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం సమర భేరిలో భాగంగా గతనెల 30వ తేదీ నుండి ఈనెల నాలుగో తేదీ వరకూ జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల నాలుగో తేదీన మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నామని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, రూ.450 ఉన్న గ్యాస్ ధర రూ.1200కు పెరిగిందన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కంటితుడుపుగా రూ.200 కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. కాయగూరలు, పప్పులు, నూనెలు 50 శాతం పెరిగాయన్నారు. జిల్లాలో మూతపడిన ఏలూరు జ్యూట్ మిల్లు, భీమడోలు సుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచి వంద రోజుల పని కల్పించాలని, గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాలకు కూడా విస్తరింపచేయాలని డిమాండ్ చేశారు.



ఆగిరిపల్లి మండలంలో..



కలిదిండి మండలంలో..



భీమడోలులో ట్రైనీ కలెక్టర్

అభివృద్ధి పనులపట్ల ట్రెయినీ కలెక్టర్ సంతృప్తి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల ట్రైనీ కలెక్టర్ పూజా తిరుమని సంతృప్తివ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పరిపాలన, ఇతరఅంశాలపై శిక్షణకు భీమడోలు వచ్చిన ఆమె రెండో రోజు శనివారం భీమడోలు పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. గ్రామపంచాయతీ చేపట్టిన పారిశుధ్య నిర్వహణ, ఇతర కార్యక్రమాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వెలిబుచ్చారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పలు వివరాలు అడిగితెలుసుకున్నారు. కేంద్రం నిర్వహణ తీరు ఇతరులకు ఆదర్శంగా ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆమె ఆరోగ్య కేంద్రంలోని వివిధ అంశాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం నిర్వహణ బాగుందని, రోగులకు, ఇన్ పేషెంట్లకు అందుతున్న సేవల గురించి రోగులను అడిగితెలుసుకున్నారు. ల్యాబ్ నిర్వహణ, రక్తపరీక్షలు చేసే విధానం, ఆరోగ్య కేంద్రం నియమ నిబంధనలకు అనుగుణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్, ఎంపిటిసి, ఎం.జాన్సన్ పాల్గొన్నారు.

చాట్రాయిలో డెంగీ కేసుల్లేవు : డిఎంహెచ్ఒ

ఏలూరు: చాట్రాయి మండలం చనుబండలో ఎలాంటి గెంగీ జ్వరాలు నమోదుకాలేదని డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఆ గ్రామానికి చెందిన పర్వ శ్రీనివాసరావు(52) ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతూ, అదేక్రమంలో అతనికి షుగర్ లెవిల్స్, ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గడం వలన విజయవాడ, ఆంధ్రా ఆసుపత్రిలో చేరాడని, అతనికి ఇంకా డెంగీ కేసుగా నిర్ధారణ కాలేదన్నారు. అయినప్పటికీ చనుబండలో హుటాహుటిన ఆరోగ్య సిబ్బంది ద్వారా పలు వైద్యసేవలకు సంబంధించి చర్యలు చేపట్టామని తెఇపారు. నిర్విరామంగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామంలో ఫాగింగ్ చేయిస్తున్నామని, అపరిశుభ్ర ప్రదేశాలు, వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. యాంటీ వెక్టార్ కెమికల్ స్ప్రెయింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రం చేయిస్తున్నామన్నారు. తాగునీటిని నాణ్యత పరీక్షలు నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. గోరువెచ్చని ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు.

'పల్లెబాట'లో జిల్లా అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాల అమలు పర్యవేక్షణపై మండల ప్రత్యేక అధికారులు శనివారం 'పల్లెబాట' పట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీల సంక్షేమాధికారి, దెందులూరు మండల ప్రత్యేక అధికారి ఎన్ఎస్.కృపావరం మండలంలో విస్తతంగా పర్యటించారు. ముందుగా జోగన్నపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మహిళలకు, బరువు తక్కువ కలిగిన పిల్లలను గుర్తించి వారికి అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్వయంగా రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిపి పాఠశాలను పరిశీలించారు. నాడు–నేడు పథకంలో చేపట్టిన అదనపు తరగతి గదులు నిర్మాణం వేగవంతం చేయాలనీ అధికారులను ఆదేశించారు. అనంతరం గాలాయగూడెంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

ఏలూరు రురల్ మండలంలోని తంగెళ్లమూడి, చొదిమెళ్ల సచివాలయాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.ఆశ పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చాటపర్రులోని పిహెచ్‌సి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో జరుగుతున్న కంటి పరీక్షలను పరిశీలించారు. గర్భిణులకు జరుగుతున్న ఆరోగ్య పరీక్షలు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి అందిస్తున్న చికిత్సలు, చంటి పిల్లలకు ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను రిజిస్టర్ ప్రకారం పరిశీలించారు.

పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు ముసునూరు మండలంలోని కొర్లగుంట గ్రామంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో రుణమేళాను నిర్వహించి, పాడి రైతులకు పశువులను అందించారు. జగనన్న పాలవెల్లువలో పాల సేకరణ మరింత పెంచాలని, ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలన్నారు.

మానవత వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

జంగారెడ్డిగూడెం: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. శనివారం మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ జిల్లా రక్తనిధి ఛైర్మన్ అయినాల రమణమూర్తి(మానవత మూర్తి) ఆధ్వర్యంలో 29వ వార్డు బాలాజీనగర్ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏలూరు శంకర నేత్రాలయ, గుడ్ సమరిటన్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ నాగలక్ష్మి ప్రారంభించారు. మేడవరపు విద్యాసాగర్ నేత్ర వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఆనంతరం నాగలక్ష్మి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల వల్ల సామాన్య ప్రజలకు ఎంతోమేలు చేకూరుతుందన్నారు. ఈ శిబిరాలను ఉపయోగించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. క్యాంపు ఆర్గనైజర్ చిటికెన రాంబాబు మాట్లాడుతూ వైద్యులు సోనిక, ఆదిత్య, బాషా వైద్య సేవలందించారన్నారు. సుమారు 279 మంది మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఈ వైద్య సేవలను ఉపయోగించుకున్నారని తెలిపారు. 36 మందికి కంటి ఆపరేషన్లకు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కన్వీనర్ త్రిపురసుందరి, మండల అధ్యక్షులు డికె.రెడ్డి, మండల సెక్రటరీ గద్దె సత్యనారాయణ, చింత అనిల్‌కుమార్, సంకు సురేష్, మైరెడ్డి జగదీష్, నెలప్రోలు ప్రభాకర్ పాల్గొన్నారు.

నీటిఎద్దడిని అధిగమించేందుకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా స్థాయిలో ఏమైనా నీటిఎద్దడి సమస్య ఉంటే దానిని అధిగమించేందుకు ఇరిగేషన్ బోర్డు సమావేశాలు, వ్యవసాయ సలహాల మండలి సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. శనివారం విజయవాడ నుండి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, హౌసింగ్ పీడీ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పశు సంవర్ధకశాఖ జెడి జి.నెహ్రూబాబు, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, డిసిసిబి సిఇఒ శ్రీదేవి, జిఎస్ డబ్ల్యుఎస్ నోడల్ అధికారి రమణ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున జిల్లాస్థాయిలో ఇరిగేషన్ బోర్డు, వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని, జగనన్న పాల వెల్లువకు రుణాలిప్పించాలని, చిరుధాన్యాల సాగు పెంచాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం వల్ల 25.3 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, దీనివల్ల రాష్ట్రంలో 43శాతం నీటి లభ్యత మాత్రమే ఉందిని, భూగర్భ జలాలు దాదాపు రెండు మీటర్లు కిందకు వెళ్లిందని తెలిపారు. ఖరీఫ్‌లో ఉన్న పంటలను రక్షించుకోవాలని, దానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశ అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ లావణ్యవేణి వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆయా శాఖలకు నిర్దేశించిన ఆదేశాలను పాటిస్తూ లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను ఈనెల 15లోగా పూర్తిచేయాలన్నారు.

ఎండు ఖర్జూరంలో పురుగులు

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం నాశిరకంగా ఉంటోంది. పౌష్టికాహార తనిఖీ కూడా నామమాత్రంగా ఉండటంతో నాశిరకమైన పదార్థాలు సరఫరా అవుతున్నాయి. ముఖ్యంగా మండలంలో దేశవరం అంగన్‌వాడీ కేంద్రంలో రెండు రోజులక్రితం సరఫరా చేసిన ఎండిఖర్జూరం ప్యాకెట్లలో పురుగులు ఉండటంతో బాలింతలు, గర్భిణులు కంగారుపడ్డారు. వెంటనే వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చూపించారు. ఇలాంటివాటిని సరఫరా చేయడం వల్ల బాలింతలు, చిన్నారులు రోగాల బారిన పడతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దీనిపై చింతలపూడి సిడిపిఒ మాధవిని వివరణ కోరగా అంగన్‌వాడి సెంటర్లను తనిఖీ చేస్తామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టిలో పెడతామన్నారు. మండలంలో సరఫరా చేసిన ఎండు ఖర్జూరం ప్యాకెట్లను అంగన్‌వాడీల ద్వారా వెనక్కితీసుకుంటామని, నాణ్యమైనవి సరఫరా చేస్తామని చెప్పారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



నాగరాజు(ఫైల్‌ఫొటో)

విద్యుత్ షాక్‌కు గురై భవన నిర్మాణ కార్మికుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడారు. ఈ ఘటన మండలంలోని నాగులగూడెంలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నాగులగూడెంలో గోలి శ్రీనివాసరెడ్డికి చెందిన భవన నిర్మాణ పనుల్లో భాగంగా శనివారం శ్లాబ్ పనులు చేపట్టారు. శ్లాబ్ పని ముగిసిన తర్వాత భవనం కింద నుంచి పైకి మెటీరీయల్ తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన పోల్స్‌ను పనుల్లో పాల్గొన్న తప్పెళ్ల నాగరాజు(33)తో పాటు మరికొంత మంది తొలగిస్తున్నారు. పోల్స్‌ను తొలగించే క్రమంలో సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగలింది. దీంతో నాగరాజు, పత్తిపాటి వెంకటరావు, మంగమూరి నాగరాజు విద్యుత్ షాక్‌కి గురయ్యారు. ఘటనా స్థలంలోనే తప్పెళ్ల నాగరాజు మృతి చెందాడు. వెంకట్రావు, ముంగమూరి నాగరాజు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని జంగారెడ్డిగూడెంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు నాగరాజు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతినీడిపాలేనికి చెందిన భవన నిర్మాణ కార్మికుడుగా గుర్తించారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి.. వైఎస్ఆర్

జిల్లావ్యాప్తంగా వర్ధంతి సభలు


ప్రజాశక్తి - చింతలపూడి

రాజశేఖర్ రెడ్డి బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అని చింతలపూడి మండల సచివాలయం కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలో కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాంధవుడు, ఆరోగ్యశ్రీ రూపకర్త, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో స్థిరస్తాయిగా నిలిచిపోయిన మహానేత రాజశేఖర్ రెడ్డి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలిప్, నగర పంచాయతీ కన్వీనర్, సిటి మెడికల్ దుర్గారావు, యండపల్లి సర్పంచి మోహన్ చంద్రు నాగేశ్వరావు, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వైసిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జడ్‌పిటిసి చిగురుపల్లి సామ్యూల్, ఎంపిటిసి పెద్దిరెడ్డి రమ్య కుసుమ నాగేశ్వరరావు, సర్పంచి కుంటం స్వర్ణలత సతీష్, పంచాయతీ బోర్డు సభ్యులు ఇమ్మడి నాగేశ్వరరావు, బొండాడ సావిత్రి సాక్షి, చిలుకూరి నాగసుబ్రమణ్యం, దూలపల్లి ప్రసాద్, నడిగట్టి చిన్న, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


భీమడోలు : ఆగడాల లంకలో వైఎస్ఆర్ వర్ధంతి పురస్కరించుకొని భీమడోలు ఎంపీపీ కనుమాల రామయ్య, గ్రామ సర్పంచి బి.రాంబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. దీనిలో భాగంగా వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ రాష్ట్ర అభివృద్ధికి వైఎస్ఆర్ చేసిన సేవలను వివరించారు. ఆ తర్వాత టిడిపి నుంచి వైసిపిలోనికి చేరేందుకు ముందుకు వచ్చిన వంద మందికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్య శ్రీనివాస్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ, భీమడోలు సొసైటీ మాజీ అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, పార్టీ ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ముసునూరు : రైతులకు ఆరాధ్య దైవం వైఎస్ఆర్ అని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్ తెలిపారు. శనివారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకల్లో భాగంగా నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు, సర్పంచిలు పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ, పి.సత్యనారాయణ, ఎంపిటిసి వి.సుందరరావు, ఎంపిడిఒ జి.రాణీ పాల్గొన్నారు.



ముసునూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

రైతుభరోసా కేంద్రాలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌లు పేర్కొన్నారు. శనివారం ముసునూరు మండలంలోని చింతలవల్లి, గోపవరం గ్రామాల్లో వైఎస్ఆర్ వర్ధంతి పురస్కరించుకుని గోపవరంలో రూ.40 లక్షల, చింతలవల్లిలో రైతుభరోసా కేంద్రం రూ.21.80 లక్షల, చింతలవల్లిలో సచివాలయం రూ.40 లక్షల నిధులతో నిర్మించిన మూడు నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, మైనార్టీ వర్గాల ప్రజలు వైఎస్ఆర్‌సిపికి అనుకూలంగా వున్నారని, మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, వైస్ఎంపిపి-2 పాముల గంగాధరరావు, సర్పంచిలు కంచర్ల వాణీ, పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ, పి.సత్యనారాయణ, ఎంపిటిసిలు కోండా దుర్గాభవాని, వి.సుందరరావు, ఎంపిడిఒ జి.రాణీ, వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్, కంబాల రాంబాబు పాల్గొన్నారు.



పోలవరంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ఉంగుటూరు : వైఎస్ఆర్ వర్ధంతి శనివారం ఉంగుటూరు మండలంలో వాడ వాడలా ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. నారాయణపురంలో మండల కన్వీనర్ మరడ మంగారావు, చేబ్రోలులో సొసైటీ ఛైర్మన్ పాపారావుబాబ్జి, ఉంగుటూరులో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, కైకరంలో జడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, పుప్పాలగోపి, ఆయా గ్రామాల్లో అధికార పార్టీ సర్పంచిలు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఎంపిపి కోర్స పోసమ్మ అధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పళ్లు, రొట్టె పంపిణీ చేశారు. దర్భగూడెం పంచాయతీ లక్ష్మీపురంలో సర్పంచి సున్నం ఉషారాణి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నూతనంగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. ములగలంపల్లిలో వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్ అధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంతరావు, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, బోధ శ్రీనివాస్, ఎంపిటిసి సున్నం సురేష్, సర్పంచి చిర్రి జగదాంబ, సంద ప్రసాద్, ఉప సర్పంచి రాఘవరెడ్డి, కె.రాము, చక్రి, సత్యనారాయణ, ఉప్పల రాంపండు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో శనివారం వైఎస్ఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయన విగ్రహానికి పూలు మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో వైఎస్ కొలువై ఉన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కళాశాలలో శనివారం సెక్యూరిటీ సిబ్బంది ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడుతూ వైఎస్ఆర్ పుణ్యంతోనే వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి, వేలాది మంది పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ చదువు అందుతుందన్నారు.

చాట్రాయి : కాండ్రేగుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు కాండ్రేగుల చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిపాలనా దక్షతతో సుపరిపాలన అందించి, ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయిన మహానేత కీర్తిశేషులు వైఎస్ఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి శ్రీనివాసరావు, పేరం బసవయ్య, కొత్తా రాంబాబు, కాండ్రేగుల చంద్రశేఖర్, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని పలు గ్రామాలైన పోలవరం, ఇటికలకోట, ప్రగఢపల్లి, ఎల్లండిపేట, కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ, గూటాలలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక ఇందిరా కాలనీ, మిలటరీపేట, మార్కెట్ యార్డ్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహాలకు ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి నీలి సుమన్, సర్పంచి ఎం.మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, ఉపాధ్యక్షులు పాము రవికుమార్, నాయకులు ఎస్‌కె.చాన్, చాంద్ పాషా, కందుల వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద వర్గాల అభ్యున్నతికి వైఎస్ఆర్ విశేష కృషి చేశారని నీలి సుమన్ తెలిపారు.

టి.నరసాపురం : వైఎస్ఆర్ చిరస్మరణీయుడని జడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు తెలిపారు. మండలంలోని టి.నరసాపురం, కేతవరం, బంధంచర్ల, కృష్ణాపురం, ఏపిగుంట, బొర్రంపాలెం గ్రామాల్లో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.లక్ష్మి, శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, మోదుగు సునంద, తడికల పూడి శివ మాధవి కిషోర్, భుక్యా వేణు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలోని బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా వడాలి, అల్లూరు, సింగరాయపాలెం, పెదపాలపర్రు, చిగురుకోట, నరసన్నపాలెం తదితర గ్రామాల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ భిక్షాలు, గంటా సంధ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధా, గంటా కోటేశ్వరరావు, శీలం రామకృష్ణ, జంపాన కోటయ్య పాల్గొన్నారు.



అల్లూరులో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి జయమంగళ

బుట్టాయగూడెం : వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా బుట్టాయగూడెం, దుద్దుకూరు, తెల్లవారిగూడెం, ముప్పినవారిగూడెం, అరుంధతి కాలనీ దగ్గర రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అనంతరం స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పాలు, పళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జడ్‌పిటిసి మొడియం రామతులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపీపీలు, కుక్కల వరలక్ష్మి, గోపి, గుగ్గులోతు మోహన్ రావు, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : వైసిపి అధ్యక్షులు పిపిఎన్ చంద్రరావు ఆధ్వర్యంలో పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ ఆయన తనయుడు వైఎస్ జగన్ తండ్రికి మించిన నాయకుడిగా, రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఏలూరు జిల్లా వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వామిసెట్టి హరిబాబు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు(అంజి) వైసిపి నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్నా, కౌన్సెలర్‌లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు పాస్‌లకు ఆర్థిక సాయం

75 మంది విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 75 మంది ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, బడికి వచ్చేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించిన దాతలు అభినందనీయులని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. శనివారం చేబ్రోలులో విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. సభకు ప్రధానోపాధ్యాయులు ఎస్.ఉమ అధ్యక్షత వహించారు. చేబ్రోలు గ్రామానికి చెందిన దివంగత యెలిశెట్టి నానాజీ జ్ఞాపకార్థం సోదరుడు, నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావుబాబ్జి ఇచ్చిన ఆర్థిక సాయంతో ఈ బస్ పాసులు అందించామని డిపో మేనేజర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కర్రం బుజ్జి, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, సచివాలయం కన్వీనర్ లోవరాజు, బస్ పాసుల పిఆర్‌ఒ దొంతల విజయకుమార్ పాల్గొన్నారు.

'ప్రతి రైతూ పాడి రైతు కావాలి'

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి వ్యవసాయ రైతు సొసైటీ పరిధిలో పశువుల లోను తీసుకుని పాల రైతు కావాలని అమూల్ పాల్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. శనివారం మండలంలోని కోర్లగుంట గ్రామ సచివాలయంలో గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిసిబి ప్రసాద్ మాట్లాడుతూ అమూల్ పాలకేంద్రంలో పాలు పోస్తున్న విధంగా పాడిగేదెను కొనుగోలు చేసుకుని, ఒక్కొక్క రైతుకి రూ.లక్ష లోను వ్యవసాయ పరపతి సంఘం ద్వారా అందిస్తామని గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిటిసి వి.సుందరరావు, ఎపిఎం కుంటుంబాబు, సొసైటీ సిఇఒ కె.పార్వతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పునః పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండల స్థాయి అధికారులు శనివారం జంబ్లింగ్ పద్ధతిలో గ్రామాల్లో పింఛన్ల తనిఖీ చేశారు. నూజివీడు మండలం బోరవంచ, పాత రావిచర్ల, గ్రామాల్లో ఆగిరిపల్లి ఎంపిడిఒ శంకరావు ఆగిరిపల్లి మండలం నర్సింగపాలెం, ఆగిరిపల్లిలో నూజివీడు ఎంపిడిఒ విజయ కుమారులు పరిశీలించారు. మృతులు, వలస వెళ్లిన వాళ్లు, జీవించి ఉన్న వారితో పాటు ట్రాక్టర్, కారు, పొలం, ఉద్యోగం, ఆదాయం, విద్యుత్ బిల్లులు తదితరాలను పరిశీలించారు.

కొత్త పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నూతనంగా మంజూరైన పింఛన్లను పోలవరం ఎంఎల్ఎ బాలరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ మండలంలో నూతనంగా 397 మందికి నూతన పింఛన్ అందిస్తున్నామని, గత ప్రభుత్వం మాదిరిగా జన్మభూమి కమిటీలలో సిఫార్సు చేసిన వాళ్లకు మాత్రమే పింఛన్లు ఇచ్చే వారని, ఇప్పుడు అర్హులైన వాళ్లందరికీ వాలంటీర్ వ్యవస్థ పెట్టి పింఛన్లు అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జడ్‌పిటిసి మొడియం రామ తులసి, ఎంపిడిఒ ఎస్.విజయలక్ష్మి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలను ఖండించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఇటీవల జంగారెడ్డిగూడెంలో, యువగళం పాదయాత్రలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుపై టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ చేసిన అవినీతి ఆరోపణలను ఎంఎల్ఎ బాలరాజు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవనటువంటి నీకు నా గురించి మాట్లాడే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూ సేకరణ నీ తండ్రి హయాంలోనే జరిగిందని, భూ సేకరణ మొత్తం తప్పులు తడకలే, మీ తండ్రి హయాంలోనే అవకతవకలు జరిగాయని అన్నారు. పోలవరంలో జరిగినటువంటి అవకతవకలపై ఏ ప్రభుత్వంలో జరిగాయో గుర్తించాలన్నారు. పోలవరం నిర్మాణం జరుగుతుండగా పట్టిసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభించి రూ.3వేల కోట్లు పక్కదారి పట్టించింది చంద్రబాబేనని తెలియజేశారు. నిమ్మగూడెం సర్పంచి బన్నే బుచ్చిరాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ బాలరాజు గురించి మాట్లాడే అర్హత నీకెక్కడిది అన్నారు. అనంతరం బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సెప్టెంబర్ ఐదో తేదిన జరిగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయినిలకు వేర్వేరుగా ఆటలు పోటీలు నిర్వహించారు. ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, ఎంఇఒ కె.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. మగవారికి, ఆడవారికి ఏడు రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఉపాధ్యాయ దినోత్సవం నాడు బహుమతులు అందజేయనున్నట్లు ఎంఇఒ నరేష్‌కుమార్ తెలిపారు.

సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులుగా బుచ్చిరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల పంచాయతీ సర్పంచి ఛాంబర్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచిలు అందరూ పాల్గొని మండల సర్పంచిల ఛాంబర్ అధ్యక్షులుగా బన్నే బుచ్చిరాజు, ఉపాధ్యక్షులుగా మాల్చి వెంకన్న బాబు రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.



గంబుషియా చేపలు విడుదల చేస్తున్న గ్రామపంచాయతీ, ఆరోగ్య శాఖ కార్యకర్తలు

దోమల నివారణకు చర్యలు

భీమడోలు : గ్రామపంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఇప్పటికే అందుబాటులో ఉన్న ఫాగింగ్ మిషన్ సేవలకు అదనంగా, దోమల సంతతి వృద్ధి చెందకుండా, ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్, గ్రామ సర్పంచి పి.సునీత మాన్సింగ్ తెలిపారు. గ్రామ పరిధిలోని మూడు మేజర్ మురుగు కాలవల్లో దోమల వృద్ధిని అరికట్టేందుకు గంబుషియా చేపల సేవలు వినియోగించుకొంటున్నట్లు వారు తెలిపారు. మత్స్యశాఖ సౌజన్యంతో గుండుగొలను పిహెచ్‌సి పరిధిలోని భీమడోలు హెల్త్ క్లినిక్‌కు చెందిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ వై.నాగదుర్గ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గంబుషియా చేపలను శనివారం తెచ్చారన్నారు. వీటిని గ్రామ పరిధిలోని మూడు మేజర్ మురుగు కాలువలలో శనివారం వేసామన్నారు. ఈ చేపలకు సహజంగానే పునరుత్పత్తి సామర్థ్యం ఎక్కువ, త్వరితగతిన తమ సంఖ్యను పెంచుకుంటాయని, ఇవి మురుగు కాలువలలో పెరుగుతున్న దోమల లార్వాలను తినడం వల్ల దోమల సంఖ్య పెరగదన్నారు. ఇప్పటికే పంచాయతీ దోమల నివారణకు చేపడుతున్న ప్రత్యామ్నాయ చర్యల వల్ల మిగిలిన దోమలు చనిపోయే అవకాశాలు ఎక్కువున్నాయన్నారు. శనివారం గ్రామపంచాయతీ, ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిధిలోని మూడు మేజర్ మురుగు కాలువలలో దోమల లార్వాలను తిని వేసేందుకు 4,000 గంబుషియా చేపలను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమాల వలన గ్రామ పరిధిలో దోమల ఉధృతి తగ్గుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భీమడోలు హెల్త్ క్లినిక్ సిబ్బంది మురళి, శ్రీనివాస్, చంద్రకళ ఇతర సిబ్బంది పాల్గొని సహకరించారని వారు తెలిపారు.

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం అప్రెంటీస్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు సన్‌రైజ్, లైన్స్ క్లబ్ ఎవేర్నెస్ అండ్ సర్వీస్ ఆక్టివిటీ పేరుతో క్లబ్ అధ్యక్షులు వి.సురేష్ పవర్ పేటలోని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం అప్రెంటిస్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం అప్రెంటిస్ విద్యార్థులకు మంచి ఫ్యాకల్టీ ఏర్పాటు చేసి, కంప్యూటర్ కోర్సు నేర్పిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ క్లబ్ తరఫున నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరించారు. ఈ సంవత్సరం పెదవేగి ఎస్ఎంఇసి స్కూల్ లయన్స్ సిహెచ్.అవినాష్ సౌజన్యంతో 25 వేల నోట్ బుక్స్ విద్యార్థులకు పంపిణీ చేపట్టామన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సురేష్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు విజ్ఞాన కేంద్రంను తరచుగా భాగస్వామ్యం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు, జి.శారద, డి.గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ చొరవతో గుంతలు పూడ్చివేత



గుంతలను పూడ్పిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని గురజ రోడ్డులో ఏర్పడ్డ గుంతలను ఎంఎల్ఎ డిఎన్ఆర్ చొరవతో శనివారం పూడ్చివేశారు. గురజ రోడ్డు మలుపు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు అత్యంత ప్రమాదకరంగా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి ఈ గుంతల్లో నీరు చేరి రోడ్డు కనబడక ద్విచక్ర వాహనదారులు, ప్రజలు నానా యాతన పడుతున్నారు. నిత్యం అనేకమంది ఈ గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. ఈ రోడ్డు దుస్థితి విషయం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే గుంతలు పూడ్చేందుకు చొరవ చూపారు. ఈ పనులను ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైసిపి నాయకులు పర్యవేక్షించారు.

ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల శాఖ ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని పలు గ్రామాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పార్టీ అభిమాని పూజారి రాకేష్ తన తండ్రి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం భీమడోలు హైస్కూల్లో గత సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.2,500 నగదు, షీల్డ్‌లను ధర్మరాజు చేతుల మీదుగా అందజేశారు.

దుద్దేపూడి, గుండుగొలను, సూరప్పగూడెం, భీమడోలులలో అభిమానులు కేక్ కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఉంగుటూరు నియోజకవర్గ ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గుండుగొలను శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వ్యక్తిగతంగా వికలాంగులకు నిత్యావసరాలు, పండ్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షులు పత్తి మదన్, టి.రామ్మూర్తి పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని పలు గ్రామాల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పలు కార్యక్రమాలను గోపాలపురం నియోజకవర్గ ఇంఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్‌పి స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే గుండుగొలనుకుంట, పంగిడిగూడెం గ్రామాల్లో జన సైనికుల సమక్షంలో కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ద్వారకాతిరుమల పిహెచ్‌సిలో ఏలూరుకు చెందిన రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గోపాలపురం నియోజకవర్గ ఇంఛార్జి సువర్ణ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు జనసైనికులు, వీర మహిళల సమక్షంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, ప్రతీ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతూ, ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దాకారపు మూర్తి, జనసేన నాయకులు తరగళ్ల శ్రీనివాస్, చిలుకూరి ఫణి, పవన్ కుమార్, జన సైనికులు పాల్గొన్నారు.

చింతలపూడి : 2024లో జనసేన అధికారంలోకి వస్తుందని చింతలపూడి జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు తెలిపారు. శనివారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతలపూడి హాస్పటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. అనంతరం పాతబస్టాండ్ దగ్గర అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనకు ప్రజలలో మంచి పేరు ఉందని, ప్రజలందరూ పవన్ కళ్యాణ్‌ను 2024లో ముఖ్యమంత్రిని చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా జాయింట్ సెక్రటరి తుమూ విజయ్ కూమర్, రాఘవేంద్రరావు, కోట్టే రవికూమర్, సూర్య, విరమహిళలు భారతి పాల్గొన్నారు.

ప్రగఢవరం పంచాయతీలో జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు శ్రీవాటర్ అధినేత చంద్రబాబు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, బైక్ ర్యాలీ నిర్వహించారు.

స్థానిక కొత్త బస్టాండ్‌లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇంఛార్జి మేక ఈశ్వరయ్య, పార్టీ నాయకులు చింతల నాని, ఆకుల రాకేశ్‌లు ప్రారంభించారు. అనంతరం స్థానిక అమ్మా, నాన్న వికలాంగుల సేవా సంస్థకు బియ్యం, కిరాణా సరుకులు అందజేశారు. సంస్థలో ఉన్నవారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గురుజు ఉమామహేశ్వరి, జంగారెడ్డిగూడెం పట్టణ జనసేన అధ్యక్షులు షేక్ పీరు, మళ్లిపూడి రవి, తిరుమలశెట్టి రవి, కోరే రంగనాథ్, కోసూరు కనకమహాలక్ష్మి, దెందుకూరు రాజి, బాధరాల నరేష్, శ్రీరామ్, మధునంద, చింతా శైలేంద్ర, యాతం సుధీర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక జగదాంబ అమ్మవారి దేవాలయంలో పూజలు చేశారు. పోలవరం నియోజకర్గ ఇంఛార్జి చిర్రి బాలరాజు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పళ్లు పంపిణీ చేసి జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్ను, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కరాటం సాయి, గడ్డమనుగు రవి, మండల కన్వీనర్ పసుపులేటి రాము, సాయి మధు పాల్గొన్నారు..

నూజివీడు రూరల్ : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ జనసేన నేత బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో బిసి హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, కాస్మోటిక్స్ పరికరాలు శనివారం వితరణగా అందించారు. అనంతరం కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో పేదలకు అన్నసంతర్పణ చేశారు. రెల్లి పేటలో కేక్ కట్ చేసి, పోషకాహారపు ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ముదినేపల్లి : సినీనటుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి, సింగరాయపాలెం, దేవపూడి, బొమ్మినంపాడు, గురజ, వాడవల్లి తదితర గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు. జనసేన ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని గురజ రోడ్డు సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. టిడిపి యువనేత కె.వినోద్ పాల్గొని వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకయ్య, నానాజీ, హనుమాన్ ప్రసాద్, ఎ.భరత్ పాల్గొన్నారు.

కలిదిండి : జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని మండలంలోని కొండంగిలో పాఠశాలల విద్యార్థులకు రూ.25 వేలు విలువగల నోటు పుస్తకాలను, పెన్నులు జనసేన యువసేన ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం కోరుకొల్లు నుంచి కలిదిండి ప్రధాన సెంటర్ వరకూ కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు నల్లగోపుల చలపతి రావు(నాని) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోలవరం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 51వ పుట్టినరోజు వేడుకలను పోలవరం మండలం కొత్తపైడిపాక గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుణపర్తి వీరవెంకట సత్యనారాయణ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీ గల నాయకుడు, నేటి యువతకు ఆదర్శనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి రామప్రసాద్, కొల్లాపుశ్యామెలు, గొల్లపూడి వెంకటేష్, వార.యేసు, జనసేన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 619/2022 in I.A.No. 808/2017 in O.S.No. 150/2017

Between:
Javvadi Naga Satyavathi
...Petitioner /Plaintiff
AND
Vulli Balarama Mani (Died) and Others
...Respondents /Defendants

I.A.No. 630/2022 in O.S.No. 150/2017

Between:
Javvadi Naga Satyavathi
...Petitioner /Plaintiff
AND
Vulli Balarama Mani (Died) and Others
...Respondents /Defendants

I.A.No. 631/2022 in O.S.No. 150/2017

Between:
Javvadi Naga Satyavathi
...Petitioner /Plaintiff
AND
Vulli Balarama Mani (Died) and Others
...Respondents /Defendants

2 to 4 Respondents /Defendants:

2nd Respondent /Defendant:
Vulli Naga Suresh, S/o. Naga Durga Prasada Rao, D.No.21-2112 (255), Near House Of Eeli Nanigaru, Old Town, Tadepalligudem.

3nd Respondent /Defendant:
Vulli Ramesh, S/o. Naga Durga Prasada Rao, D.No.21-2112 (255), Near House Of Eeli Nanigaru, Old Town, Tadepalligudem.

4nd Respondent /Defendant:
Vulli Surekha, D/o. Naga Durga Prasada Rao, W/o. Dr.Srinivasa Rao, D.No.21-2112 (255), Near House Of Eeli Nanigaru, Old Town, Tadepalligudem.

పై నెంబరు దావాలో పిటీషనరు /వాది గారు 1వ రెస్పాండెంటు /1వ ప్రతివాదిపై ప్రాంశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసిన దర్మిలా 1వ రెస్పాండెంటు /1వ ప్రతివాది చనిపోవుట వలన 2 నుంచి 4 రెస్పాండెంట్లు /2 నుంచి 4 ప్రతివాదులు అయిన మిమ్మల్ని వారసులుగా చేర్చమని, Abatement ను రద్దు పర్చమని మరియు వారసులు చేర్పించుటలో అయిన ఆలస్యమును చెల్లించమని పిటీషనులు దాఖలు చేసిన దర్మిలా 2 నుంచి 4 రెస్పాండెంట్లు /ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించియున్నప్పటికీ మీరు తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలు నిమిత్తం 2 నుంచి 4 రెస్పాండెంట్లు /ప్రతివాదులు అయి మీకు దీ.06-09-2023వ సం॥రం తేదీన వాయిదా రోజున మీరు ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయం గా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : దీ.06-09-2023

ముద్దన శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 99483 37320